## రాష్ట్ర రాజకీయం

రాష్ట్ర రాజకీయంలో కొంత నిలకడ కాస్తంత స్తిమితం యేర్పడింది. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ఎన్నిక కావటం. రాష్ట్ర శాసనసభా నాయకుడుగా శ్రీ సంజీవరెడ్డి 'గంభీరంగా' నిలబడితే వారి అండదండలతో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి పదవిని చెలాయించటం. రాష్ట్ర ప్రభుత్వానికి కొంత స్తిమితాన్ని చేకూర్చింది.

అయినా రాజకీయం రాజకీయమే కాబట్టి యేదో ఒక పార్టీని అది అంటి పెట్టుకుంటూనే వుంటోంది రాష్ట్రంలో. ఇన్నాళ్లూ కాంగ్రెసు వంతైతే ఇప్పుడు దాని బాధ్యత కమ్యూనిస్టులమీద పడింది.

'కుడి యెడమల కుసుమపరాగం' కమ్యూనిస్టులలోకూడా ప్రవేశించింది.

మొన్న రాష్ట్రశాసనసభ నియోజకవర్గం నుంచి రాజ్యసభకు పోటీచేసిన 'అధికార కమ్యూనిస్టు అభ్యర్థి'తో మరొక అనధికార కమ్యూనిస్టు అభ్యర్థికూడా పోటీచేసి ఓడిపోయారు.

రాష్ట్ర శాసనసభలో కమ్యూనిస్టుల మొత్తం ఓట్లు యాభైరెండు. నిక్కచ్చిగా గెలవాలంటే యే అభ్యర్థికైనా నలభైఓట్లు రావాలి.

మరోవిషయం 'అధికారఅభ్యర్థిని ప్రతిఘటించకూడదని రాష్ట్రపార్టీ ఆదేశాన్ని ఇచ్చింది. అయినా దీనిని ఉల్లంఘిస్తూనే శ్రీ సుందరయ్యగారివర్గం తమ 'అనధికార అభ్యర్థి'ని నిలబెట్టింది.

"కుడి యెడమల కుసుమపరాగం" మరింత గుబాళిస్తోంది.

చిత్రమేమిటంటే—క్రమశిక్షణకు కమ్యూనిస్టులది పెట్టిందిపేరు. సిద్ధాంతాలను నమ్మితే "అరుపులు" వేసినా వారిలో 'విశ్వాసం' అచంచలంగానే వుండిపోతుంది. అందుకే వారిలోని ఈ విభేదాలు అంత లోతుగా. ఘాటుగా. ఘనంగా పాతుకుపోయినాయి.

ప్రొద్దున్నే ప్రశ్నలతో ప్రారంభం. మంత్రులు సమాధానాలు సరిగ్గా అందించటలేదని సభ్యుల 'మొత్తుకోళ్ళు'. అందిన సమాచారాన్నే అందజేస్తూన్నాం. అలా కాదనుకుంటే వేరే ప్రశ్న వెయ్యండి. వేరే సమాధానం చెబుతాం—జవాబు.

రాష్ట్రశాసనసభ మొన్నిమధ్యన ముఖ్యమంత్రిగారి నడిగిన ప్రశ్నలకు సకాలానికి సమాధానాలు (జాబితాలోయెక్కిన ప్రశ్నలకు కూడా) అందలేదుకాబట్టి. ఆ ప్రశ్నలను మరో రోజుకు వాయిదావేశారు.

"సమాచారశాఖను నిర్వహిస్తున్న మంత్రికికూడా సకాలానికి సమాచారం అందలేదా అండీ" ఇది ఒక ఛలోక్తి (ముఖ్యమంత్రి సమాచారశాఖను కూడా నిర్వహిస్తున్నారు.)

ఒక కార్పొరేషన్ సరిగ్గా పనిచెయ్యటం లేదని చాలామంది సభ్యులు ఘాటుగా విమర్శించారు. లేదు. ఆ కార్పొరేషన్ చాలా దివ్యంగా పనిచేస్తోంది అని ఆ కార్పొరేషన్ అధికారి పంపిన 'రిపోర్టు'నే యధాతధంగా మంత్రిగారు చర్చకు సమాధానంగా చెప్పివేశారు.

చర్చలు ముగిసిన తరువాత. మంత్రిగారు సమాధానం చెప్పినతరువాతకూడా. సభ్యులు ఇంకా సందేహాలను వెలిబుచ్చుతూనేవుంటే — మళ్ళీమళ్ళీ మంత్రిగారు లేవబోతుంటే. వారితరఫునే స్పీకర్ జోక్యం కలుగజేసుకుని "మీరు చెప్పినవి బాగున్నాయి. అన్నింటినీ మంత్రిగారు ఆలోచిస్తారు" అని సమాధానం చెబుతారు.

"అవును ఆలోచించటానికి ప్రయత్నం చేస్తాం" అని మంత్రిగారి హామీ.

"ఆలోచనకు కూడా ప్రయత్నంకావాలా!" అని 'లాబీ'లో అనంతానికి సందేహం.

—అనంతం.

# "నా మొహంలో ఏముంది?"

"నా మొహం చూస్తే నీ కేమనిపిస్తోందీ?" అన్నాడు అన్నయ్య.

"అంటే" అన్నాను. "ఇదేం ప్రశ్న" అనుకుంటూ.

"అదే. రౌడీగా కనిపిస్తున్నానా? ఐడియలిస్టుగానా? లేక పెసిమిస్టుగా?" అన్నాడు.

నాకు వాడి ప్రశ్నల "తుదా" "మొదలు" తెలియటల్లేదు:

"బాగుంది. నన్నడిగితే నాకే యిస్టుగానూ కనిపించటల్లేదు. నాకు, అన్నయ్యగా ఇస్టుడుగా కనిపిస్తున్నావ్."

"పెద్ద తెలివిగా మాట్లాడకు. వూరికే అడుగుతున్నా. రౌడీగా కనిపిస్తానుకాబోలేం?" అన్నాడు అన్నియ్యవిసుగ్గా.

"ఏ సైకాలజిస్టునన్నా సంప్రతించు" అన్నాను కొంచెం కోపంగా. వేసిన ప్రశ్న వెయ్యటమేకాకుండా నన్ను అనుమానిస్తున్నాడు.

"నీ అభిప్రాయం చెబుదూ!" అన్నయ్య గొంతులో యీసారి బ్రతిమాలే ధోరణి వినిపిస్తోంది.

"చెప్పటాని కేముంటుందీ? నీ మొహంలోనూ ఒక ముక్కూ. నోరూ. కన్నూ. చెవి...."

"చాల్లే" నే చెప్పేదానికి మధ్యలోనే అడ్డొచ్చాడు అన్నయ్య చిరాగ్గా.

"సరే చెప్పటానికి ముందు ఏం జరిగిందో చెప్పాలి నాకు" అన్నాను సీరియస్‌గా.

"పిక్చరుకెళ్లాం. నేనూ. మరికొంతమంది స్నేహితులు కలిసి. ముగ్గురు అన్నగారూ. చెల్లెలూ. వదినగారూ కాబోలు. మేం కూర్చున్న వేపు కాకుండా అవతల తలుపు దగ్గర కూర్చున్నారు. అంతవరకూ బాగానే వుంది: ఇంట్రవల్‌లో మావాళ్ళు బఠానీలు కొని. ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క గింజ అమ్మాయిలు కూర్చున్న సీట్లో వేసొచ్చారు చీకట్లో పిక్చరు మొదలవబోతూండగా. నే వద్దని చెబుతూనేవున్నా. నామాటవింటేనా?"

"ఇంతకీ నువ్వు వెయ్యలేదా?" అన్నాను అనుమానంగా.

"ఒట్టు. అలాటి పనులు చెయ్యాలన్నా. చేసేవాళ్ళని చూసినా. నువ్వే గుర్తొస్తావ్"

నాలో ఎక్కడో గర్వంతళుక్కుమంది.

"సరే, కానియ్" అన్నా.

"పిక్చరయిపోయింది. వాళ్ళంతా అటుపోతుంటే యధాలాపంగా నేను సినిమాని గుర్తుతెచ్చుకు నవ్వుకుంటూ ఖర్మం చాలక వాళ్ళు కూర్చున్న తలుపువేపు వెళ్తున్నాను. ఆ అమ్మాయి అన్నగారే అనుకుంటా, చటుక్కున్న కాలరే పట్టుకున్నాడో. చెయ్యే పట్టుకున్నాడో ఆ హడావుడిలో నాకు తెలీలేదు. తెల్లబోయి నోట మాటరాక నిల్చున్నాను. నలుగుర్నీ పోగుచేసి గట్టిగా అరుస్తున్నాడు. మా ప్రబుద్ధులూ వచ్చారు. హాలు మేనేజర్ని వెంట పెట్టుకుని. అతనంటాడూ-ఆ బఠానీలు నేనే వేశానని నా మొహమే చెబుతోందట. లేకపోతే నవ్వుకుంటూ అటెందుకు వెళ్తాననీ-అప్పట్నుంచీ చచ్చే భయంగా వుందనుకో. నా మొహంలో ఏం కనిపించకపోతే. నన్నే అపరాధిగా నిర్ణయిస్తాడా?"

"తర్వాతేం జరిగిందీ?" అన్నాను.

"ఏం జరుగుతుందీ. మా వాళ్ళంతా ఆతే మాట్లాడే తంతామనీ. నా అంతమంచివాడు లేడనీ. కావాలంటే పెద్దపెద్దవాళ్ళ సాక్ష్యం తెస్తామనీ హడావుడిచేసి, అతనిచేత క్షమార్పణచెప్పించారనుకో. అయినా నా కేవిటో బాధగానేవుంది. నా మొహాన్నిగురించి" అన్నాడు.

"ఫేస్ యీజ్ ది యిన్‌డెక్స్ ఆఫ్ ది మైండ్. బహుశా నువ్వుకూడా చెయ్యాలను

కుని వుంటావ్. దేవదాసు. దివోదాసు కథలో మాదిరి ఒకదేమో వేశ్యాలోలుడైకూడా భగవంతుని గురించి చింతపడేవాట్ట. రెండో వాడు భగవత్ప్రార్థనలో నిమగ్నమయినట్లే కనిపించినా, మనసులోమాత్రం మొదటివాడి అదృష్టానికి అసూయపడేవాట్ట. దేముడు మొదటివాడ్నే కరుణించాడు" అన్నాను అన్నయ్యనియింకొంచెం వుడికించాలన్నట్లు.

"ఛా". అన్నయ్య మొహం వివర్ణమై పోయింది. నాకు జాలేసింది.

● ● ●

"పోతన భక్తిపరుడని, గుండూ, గిండూతో వర్ణిస్తారుగానీ. అది తప్పు. పోతన ఎంత భక్తిరసంగా రాసినా. అతను చాలా శృంగార ప్రియుడు. శ్రీనాధుడు యెంత శృంగారం రాసినా ఆధ్యాత్మిక చింతన కల వాడు" అంటారు మా తెలుగు మేష్టారొకాయన. ఆ విషయం నాకష్టే తెలీదనుకోండి!

తేనెపూసిన కత్తి. పయోముఖ విష కుంభం. తడిగుడ్డతో గొంతులు కోయటం మొదలయిన మాటలు ఎలా వాడుకలోకి వచ్చాయీ? మనసులోమాట బైటికి తెలియక పోవటం, ఆ తర్వాత వాళ్ళు చేసే పన్లు తెలియటంవల్లగదా! అర్ధరాత్రి పన్నెండింటికి వచ్చి తలుపులు కొట్టే అతిథిని చూడగానే "వీడిదుంపతెగా. వీడెందుకు వచ్చాడ్రా నిద్రచెడగొట్టేందుక్కాకపోతే" అనిపిస్తుంది మనసులో. మనసులో అనుకోగానే, ఆ మాటలబోర్డు మొహంమీదికొచ్చే మిషనేదన్నావుంటే! అమ్మో! ఇంకేమన్నా వుందీ? తెల్లారిలేచింది మొదలు కొని 'ఎన్ని విసుగులూ. యింట్లో వాళ్ళ మీదా బైటివాళ్ళమీదాకూడా, ఎంతకథా!

అయినా, తప్పుచేసినవాళ్ళ మొహం ఏదో విడిగా వుంటుందనుకోవటం హాస్యాస్పదమే! కనిపించకుండా నిబ్బరం నటించగలవాళ్ళూ వుండవచ్చు. దొంగా! దొరా! అన్నారు. పట్టుబడనంతకాలం దొరేగా దొంగ?

కనుబొమ్మలూ. చెవులూ. ఆడవాళ్ళల్లో మగలక్షణాలు. వాతావరణం, వయస్సూ. వంశం, పెరిగిన పరిసరాలు. రాజకీయాలు. ఆర్థిక బాధలు, సమయాసమయాలు. మత వ్యవస్థా మొదలయిన కారణాలు. నేరస్థులను తయారు చేస్తాయని. నేరం చేసేందుకు దోహదం చేస్తాయనీ అంటారు. వాటిలో కొన్ని నిరాధారమైనవి. ఎవరికన్నా తమని చూస్తే తమకి అసహ్యంవేస్తుందా? ఏదో పత్రికలో కాబోలు ఒక కథ చదివాను. ఒక రాజకుమార్తెని నువ్వు కురూపివని. పదేపదే వేధిస్తూంటుందొక అవ్వ. నిజమే కాబోలని ఆమె మనోవ్యాధిపడుతుంది. ఆమెని ప్రేమించినవాడికి. కాదని నమ్మించట మెలాగో తెలీదు. ఏదో కారణంవల్ల అతని కత్తిలో ఆమె ప్రతిబింబం కనిపించి. ఎంత మురిసిపోతుందనీ?

ఒకసారి క్లాస్ ఫొటో ఎచ్చింది. అందరూ ఎగబడుతున్నారు మేష్టారు మటుకూ, ఫొటో యివ్వకుండా ఒక్కొక్కళ్ళ మొహాలు పరిశీలిస్తున్నారు.

"మీలో చాలామందిలో, మనమెలా వున్నా మా ఫొటోలో అని కాక వాళ్ళూ, వీళ్ళూ. ఎలా వున్నారో చూద్దామన్న కుతూహలం కనిపిస్తోంది. అది తప్పు. మీ మొహాన్ని మీకు మీరు ప్రేమించాలి. ఆ తర్వాతనేఎవరిదయినా.ఇందు, ఎవరిమొహాలు వాళ్ళు చూసుకోండి" అన్నారు.

ఆయన చెప్పిన అభిప్రాయం అందరికీ సరిపోయినా, సరిపోకపోయినా, నాకు మటుకూ, ఆ క్షణంలో సరిగ్గాసరిపోయింది. ఫొటోకు పోజులివ్వటం చేతయినవాళ్ళూ, "మాది ఫొటో జెనిక్ ఫేస్" అన్నవాళ్ళూ, "వ్వ ఏవిటో. బైముకి తలదించేసేనూ," "ఎలావుంటే ఏం? సినిమాల్లో చేరబోవట ల్లేదుగా" అనేవాళ్లూ. రకరకాలు. ఒకరనేమిటీ? అందుకీ అభ్రుతత ఏమిటో? ఈ సంగతి ఎలా కనుక్కున్నారూ ఆయన? అనుభవం సార్; అనుభవం! □□□

—కె. త్రిపుర.



''నవో నవో భవతి జాయమానః''

''ఆశీర్వచనపు వనస-అమ్మయ్యా!'' అనుకున్నాడు సుబ్బా